విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్

ఉద్యోగులకు ఐదు డీఏలు ఇవ్వాల్సిందే

- ఐఏఎస్‌ల కమిటీ నివేదిక అందించాలి
- టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ జగదీశ్వర్

కరీంనగర్ కలెక్టరేట్, మే 17: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు ఇవ్వాల్సిందేనని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ స్పష్టంచేశారు. శనివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడేందుకు ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రకటించిన అనంతరమే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారని తెలిపారు. ఉద్యోగుల ఇబ్బందులపై ప్రభుత్వం సబ్‌కమిటీ ఏర్పాటు చేసి 8 నెలలు గడిచినా ఇప్పటివరకు తమతో చర్చించకపోవడంతో ఐకాస ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రకటించినట్టు తెలిపారు. వెంటనే స్పందించిన సీఎం.. ఐఏఎస్ అధికారులతో నవీన్ మిట్టల్ కమిటీ ఏర్పాటుచేసి తమతో 2 దఫాలుగా చర్చలు జరిపినట్టు వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో మాత్రమే ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల హామీ మేరకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగులకు నెలల తరబడి పోస్టింగులు ఇవ్వకుండా వేధింపులకు గురిచేయడం మానుకోవాలని సూచించారు. ఐఏఎస్‌ల కమిటీ మరోసారి చర్చలు జరిపి సానుకూల నివేదిక అందజేస్తుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో పలుచోట్ల నిర్మించుకున్న భవనాలకు చెల్లించాల్సిన పన్నులు మినహాయిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం వసూ ళ్లు చేస్తుండటం సహేతుకం కాదని తెలిపారు.

మినీ అంగన్‌వాడీలకు సర్కారు దగా!

- పెంచిన వేతనాలు చెల్లించకుండా పాత జీతాలే చెల్లింపు
- మంత్రి సీతక్క తొలి సంతకానికి విలువ లేకుండాపోయింది
- రాష్ట్ర మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ మండిపాటు

ఖైరతాబాద్, మే 17: వేతనాలు పెంచినట్టే పెంచి పాత జీతాలు చెల్లిస్తూ తెలంగాణ సర్కారు తమను మోసం చేసిందని మినీ అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వంపై దుమ్మెత్తిపోశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 3,989 మినీ అంగన్‌వాడీ టీచర్లను అప్‌గ్రేడ్ చేసిందని, వేతనాలు పెంచే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన అంగన్‌వాడీలతో సమానంగా పనిచేస్తున్న తమను గుర్తించకపోగా, హెల్పర్లకు ఇచ్చే రూ.7,800 వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని వాపోయారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న సీతక్క 3,989 మినీ అంగన్‌వాడీ టీచర్లను అప్‌గ్రేడ్ చేస్తూ ఫైలుపై తొలి సంతకం చేశారని, హెల్పర్లను కూడా నియమిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. 2024 జనవరి నుంచి మూడు నెలలపాటు పెరిగిన వేతనం రూ.13,600 చెల్లించి, ఆ తర్వాతి నెల నుంచి ఇవ్వడం మానివేశారని వాపోయారు. మంత్రి హోదాలో సీతక్క చేసిన తొలి సంతకానికి విలువలేదా..? అని ప్రశ్నించారు. ప్రస్తుతం 12 నెలల వేతనం పెండింగ్‌లో ఉన్నదని తెలిపారు. మంత్రులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా పెంపుదల చేసిన దాని ప్రకారం 12 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని, హెల్పర్లను నియమించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెల 5వ తేదీ లోపే వేతనాలు అందించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రేణుక, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

17 నెలల్లో 3 కమిటీలు..

- ఉద్యోగుల డిమాండ్లపై మళ్లీ సాగదీతే
- త్రిసభ్య కమిటీ వేసినా ఫలితం శూన్యం
- ముగిసిన గడువు.. మరోసారి చర్చలట!
- ఇంకా రాష్ట్ర సర్కారుకు అందని నివేదిక
- ఇచ్చిన మాట మీద నిలబడని ప్రభుత్వం
- ఉద్యోగ సంఘాల జేఏసీ నేతల్లో విసుగు

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): అయితే మంత్రివర్గ ఉపసంఘం! లేదంటే అధికారుల కమిటీ! ఇంకొంచెం ముందుకెళ్తే అధికారులు, ప్రజాప్రతినిధుల మేళవింపుతో మరో అత్యున్నత స్థాయి కమిటీ! ఇలా కమిటీ వెయ్... సాగదియ్! అన్నట్టుగా ఉన్నది రాష్ట్ర ప్రభుత్వ తీరు! ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రతిసారీ ఏదో ఒక కమిటీని సర్కారు ముందుకు తెచ్చి సాగదీస్తున్నది. తమ డిమాండ్లు నెరవేరకపోవడంతో ఉద్యోగ సంఘాల జేఏసీ కార్యాచరణ ప్రకటించడం.. సర్కారు చర్చలు జరపడం.. సమస్యలు వినడం.. కమిటీ వేయడం.. ఈ కమిటీకి సమస్యలు చెప్పుకోమనడం.. తీరా కాలయాపన చేయడం సర్వసాధారణమైంది. సీనియర్ అధికారులతో త్రిసభ్య కమిటీతో కలిపి 17 నెలల్లో ఉద్యోగ సంఘాల డిమాండ్లపై సర్కారు మూడు కమిటీలు వేసింది. త్రిసభ్య కమిటీ వేసినా జేఏసీ డిమాండ్లు పరిష్కారమయ్యేలా కనిపించడంలేదు. ఈ కమిటీకిచ్చిన వారం రోజుల గడువు ముగిసింది. ఈ మంగళవారం వస్తే పక్షం రోజులవుతున్నది. కానీ కమిటీ ఇంకా నివేదికను సర్కారుకు అందజేయలేదు. మరో రెండురోజుల్లో జేఏసీతో ఈ కమిటీ మరోసారి చర్చలు జరపనున్నది. దీంతో మళ్లీ సాగదీతేనా? కాలయాపనేనా? అని ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

సందర్భం.. కమిటీ..

- పార్లమెంట్ ఎన్నికల ముందు మార్చి 10న ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఉద్యోగ సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సీఎం రేవంత్ సహా మంత్రులు హాజరయ్యారు. ఉద్యోగ సంఘాలు తమ సమస్యలను ఏకరువు పెట్టాయి. తర్వాత ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, ఐఏఎస్ అధికారి దివ్యాదేవరాజన్‌తో కమిటీ వేశారు. జేఏసీ నేతలతో పలు దఫాలుగా చర్చలు జరిపినా ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు.
- ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ 2024, అక్టోబర్ 22న ఎంప్లాయీస్ జేఏసీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. జడుసుకున్న సర్కారు జేఏసీ నేతలను చర్చలకు ఆహ్వానించింది. 2024, అక్టోబర్ 24న సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రివర్గ ఉపసంఘాన్ని వేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చైర్మన్‌గా మంత్రులు డీ శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు ప్రత్యేక ఆహ్వానితులుగా, జీడీఏ పీఎస్ మెంబర్ కన్వీనర్‌గా ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం జేఏసీతో చర్చించలేదు.. ఏ సమస్యనూ పరిష్కరించిందీ లేదు.
- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో జేఏసీ ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటించింది. మే 15న నల్లబ్యాడ్జీలతో నిరసన, జూన్ 9న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చింది. దీంతో ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్ చైర్మన్‌గా, కృష్ణభాస్కర్, లోకేశ్‌కుమార్ సభ్యులుగా కమిటీ వేసింది. వారం లోగా నివేదికను అందజేయాలని సర్కారు ఆదేశించగా, ఈ గడువు ముగిసిపోయింది.

లెక్కలేనన్ని అవమానాలు..

- 'జీవో-317పై క్యాబినెట్ సబ్ కమిటీ రిపోర్టును సీల్డ్ కవర్‌లో సమర్పించింది. సీల్డ్ కవర్‌ను నేను ఓపెన్ చేయలేదు. ఆ నివేదిక సీఎస్ దగ్గరున్నది. మీరంతా సీఎస్‌ను కలిస్తే నివేదిక ఇస్తారు. ఆ నివేదికను అధ్యయనం చేసి, మార్పులు చేర్పులుంటే సూచించండి. క్యాబినెట్‌లో ఆయా అంశాలను చర్చించి పరిష్కరిస్తాం' అని అక్టోబర్‌లో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలివి! జేఏసీ నేతలంతా ఈ నివేదికను తీసుకుందామని సచివాలయానికి వెళ్లారు. 'జీవో-317 క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ఫైల్ సర్క్యులేషన్‌లో ఉన్నది. ఇప్పుడైతే మేము ఇవ్వలేము' అంటూ సీఎస్ శాంతికుమారి చెప్పడంతో జేఏసీ నేతలంతా అవమాన భారంతో వెనుదిరిగారు.
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చర్చల సమయంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తామని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. సీఎం చెప్పినట్టు క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటుకాలేదు. సీఎం చెప్పిన తర్వాత కూడా సబ్ కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగుల జేఏసీ నేతలు సచివాలయంలో సీఎంవో అధికారులను ప్రశ్నించారు. జేఏసీ నేతలు వెళ్లి అడిగితే ప్రభుత్వం జీవోను జారీచేసింది.
- 'ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. అర్థం చేసుకోండి. డిసెంబర్ లోపు ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలు పరిష్కరిస్తాం. ఏప్రిల్‌లోపు ఆర్థిక సమస్యలు పరిష్కరిస్తాం' ఇది జేఏసీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ. 2014 డిసెంబర్ పోయింది. అయినా ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. 2025 ఏప్రిల్ కూడా గడిచింది. ఆర్థిక సమస్యలకు దిక్కూమొక్కూలేకుండా పోయింది.
- మార్చి 7న ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమయ్యారు. ఏప్రిల్ నుంచి నెలకు 500-600 కోట్ల చొప్పున ఏడాదిలో పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తామని భట్టి హామీనిచ్చారు. 'ఇక నుంచి ఎవరిచుట్టూ తిరగాల్సిన పనిలేదు. మాదీ పూచి!' అన్నారు. ఏప్రిల్ పోయి మే వచ్చింది. అయినా ఒక్క బిల్లు కూడా చెల్లిస్తే ఒట్టు.
- ఈ ఏప్రిల్లో జేఏసీ నేతలు డిప్యూటీ సీఎం భట్టిని కలిశారు. ఏప్రిల్ 12న చర్చలకు ఆహ్వానించారు. ఈ క్రమంలో జేఏసీ నేతలు సర్కారు తీరుపట్ల ఫైరయ్యారు. దీంతో చర్చలు ఆహ్వానం దశలోనే వాయిదాపడ్డాయి.
- కాంగ్రెస్ తీరును నిరసిస్తూ జేఏసీ ఈ నెల 15న నల్లబ్యాడ్జీలతో నిరసన, జూన్ 9న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులపై నోరుపారేసుకున్నారు. 'ఎవరిపై సమరం? ఎవరి మీద యుద్ధం ప్రకటిస్తున్నరు? ఉద్యోగ సంఘాల నేతలు నన్ను కోసుకుని తింటరా? నన్ను వండుకుని తింటరా ? పెన్షన్లు, ఉచిత కరెంట్ ఏది ఆపుమంటరో మీరే చెప్పండి. మేం మాత్రం బోనస్‌లు తీసుకుంటం. జీతాలు పెంచుకుంటం. మేం తినంగ మిగిలితేనే ప్రజలకు పెడతామని చెప్పండి' అం టూ ఉద్యోగులను తీవ్రంగా అవమానించారు.

రగులుతున్న ఉద్యోగులు

తమ సమస్యలు, డిమాండ్లను పరిష్కరించకపోవడంతో పాటు సర్కారు తమను తీవ్రంగా అవమానిస్తుండటంతో ఉద్యోగ సంఘాల నేతలు రగిలిపోతున్నారు. ప్రజా ప్రభుత్వంలో తమకు ఎదురవుతున్న అవమానాలను తలుచుకొని కుమిలిపోతున్నారు. 'మా డిమాండ్ల సాధనకు ఎక్కని ఆఫీసులేదు.. తొక్కని గడపలేదు. ప్రభుత్వాన్ని కలిసేందుకు మాకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదు. చర్చలకు ఆహ్వానించలేదు. సావధానంగా కూర్చోబెట్టి మాతో చర్చించిన, మాట్లాడిన దాఖలాల్లేవు. అసలు ఈ రాష్ట్రంలో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలకు గౌరవమే దక్కడంలేదు. సంఘాలకు కనీస గుర్తింపునివ్వడం లేదు. ఉద్యోగులుగా మేము పోరాటం చేయాల్సి రావడం బాధాకరం' అంటూ ఓ ఉద్యోగ సంఘం నేత వాపోయారంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. 'మేం ఉద్యోగులకు నచ్చజెప్పలేక పోతున్నం. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంతో రాజీపడ్డాయని ఉద్యోగులు మమ్మల్ని నిందిస్తున్నరు. ఏ జిల్లా కలెక్టర్ కూడా ఉద్యోగ సంఘాలతో ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. సమస్యలను పరిష్కరించలేదు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని జీఏడీలో ఇప్పటివరకు వందసార్లు వినతిపత్రాలిచ్చినం. ఆఫీసర్ల కమిటీ వేయాలని సీఎస్ వద్దకు దాదాపు 20 సార్లు వెళ్లినం. ముఖ్యమైన సమస్యలను మంత్రులు, అధికారులు పరిష్కరించకపోతే మాకెవరు దిక్కు' అంటూ మరో నేత అసంతృప్తి వెళ్లగక్కారు. అయినా సర్కారు ఉద్యోగ సంఘాలను ఖాతరు చేయడం లేదు. పైగా పలుమార్లు తీవ్రంగా అవమానించింది.

లోకం పోకడ



ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	40.9°c	23.4°c
నిజామాబాద్	40.3°c	24.6°c
నల్లగొండ	39.0°c	23.0°c
మెదక్	38.5°c	26.6°c
రంగారెడ్డి	38.0°c	22.0°c
వరంగల్	38.0°c	26.0°c
మహబూబ్‌నగర్	37.0°c	24.0°c
ఖమ్మం	35.0°c	27.0°c
కరీంనగర్	35.0°c	27.0°c
హైదరాబాద్	34.1°c	25.2°c

GOVERNMENT OF TELANGANA
OFFICE OF COLLECTOR & DISTRICT MAGISTRATE, SIDDIPET
Integrated District Offices Complex, Hyderabad Road, Duddeda-502277
PRESENT: SRI M. MANU CHOUDARY, I.A.S.,

Landline: 08457 - 230224 Fax: 08457 - 230222
Website: https://siddipet.telangana.gov.in Mail Id: collector-sdpt@telangana.gov.in Twitter: @Collector_SDPT

Procs.No.D1/2479/2024 Dated:16.05.2025.

Sub:- Grievance in Land Matters – Siddipet Division-Akbarpet-Bhoompally Mandal - Chowdarpally Village – Correction of nature of land in Sy.No.294 –formation of Committee-Orders-Issued.

Read:- 1.Orders of the Hon'ble High Court for the State of Telangana in WP.No 25521 of 2024, Dt: 13.09.2024.
2.This Office Notice No.D1/2479/2024, Dt: 04.10.2024 & 07.11.2024, 18.11.2024, 23.11.2024, 28.12.2024, 25.01.2025,22.02.2025.
3. Report of the Tahsildar, Akbarpet-Bhoompally Mandal, Lr.No.B/1119/2024, Dt: 17.03.2025.
4. This office Procs.No.D1/2479/2024, Dt: 21.04.2025.
5. A/o. Sri.Vallepu Bakkaiah S/o Lasmaiah and others received on Dated: 15.05.2025.

ORDER:

In the reference 1st read above, the Hon'ble High Court, Telangana, Hyderabad has disposed off W.P.No.25521 of 2024, Dt:13.09.2024, directing respondent No.2 i.e the District Collector, Siddipet to consider the online applications, vide Id.No.2300126290, 2300126308, 2300126272, 2300126207, 2300127162, 2300126357, 2300126228, 2300127172, 2300126297, 2300126258, 2300126234, 2300126263, 2300126279, 2300126214, 2300126284, 2300126193, 2300126275, 2300126363 & 2300126252 submitted by the petitioners in Sy.No.294/4/ఓ(Ac.1.00gts), Sy.No.294/5/ఈ (Ac.0.09gts), Sy.No.294/4/గ (Ac.0.39gts).

భూములపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు

చౌదరిపల్లి భూములపై నిగ్గు తేల్చండి

మొదటిపేజీ తరువాయి...

సర్వే నంబర్‌లో సబ్ నంబర్లతో ఉన్న 19 మంది రైతులకు చెందిన దాదాపు 12 ఎకరాల 15 గుంటల భూమిపై కొందరు రైతులు గత ఏడాది సెప్టెంబర్ 13న హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. వారి వాదనలు విన్న హైకోర్టు.. ఆయా భూములపై విచారణ జరిపి సరైన ఆదేశాలు ఇవ్వాల్సిందిగా సిద్దిపేట జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుత జిల్లా కలెక్టర్ ఆ భూములపై సమగ్ర విచారణ చేశారని, స్థానిక తహసీల్దార్, ఆర్డీవో ఇచ్చిన నివేదికల ఆధారంగా 1953 నుంచి అవి పట్టా భూములే అని ఈ ఏడాది ఏప్రిల్ 21న ఉత్తర్వులు ఇచ్చారు. కాగా ఇటీవల వల్లపు బక్కయ్యతోపాటు మరి కొంతమంది రైతులు సర్వే నంబర్ 294లోని భూమిని ఎవరికీ విక్రయించలేదని, ఎవరికీ బదిలీ చేయలేదని, పట్టాలోని లోపాలు సరిదిద్ది ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో బక్కయ్య, మరి కొంతమంది రైతుల అభ్యర్థన మేరకు మరోసారి సమగ్ర విచారణ జరుపాలని నిర్ణయించినట్టు జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విచారణ కోసం జిల్లా రెవెన్యూ అధికారి, సిద్దిపేట ఆర్డీవో, లాండ్ రికార్డ్స్ సర్వే శాఖ ఏడీ, అక్బర్‌పేట్-భూంపల్లి తహసీల్దారుతో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మరోసారి రైతులకు నోటీసులు ఇచ్చి, సమగ్ర విచారణ జరుపుతుందని, అంతవరకు ఈ ఏడాది ఏప్రిల్ 21న తాను జారీచేసిన బీ1/2479/2024 ఉత్తర్వులు నిలుపుదలలో ఉంటాయని పేర్కొన్నారు.

ఇదీ నేపథ్యం..

దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట్-భూంపల్లి మండలంలోని చౌదరిపల్లిలో సర్వే నంబర్ 294లో 178.05 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి 294/1 నుంచి 294/10 వరకు ఉన్న బై నంబర్లలో విస్తరించి ఉన్నది. సేత్వార్, కాస్రా పహణీ రెవెన్యూ రికార్డుల్లో ఈ మొత్తం ప్రభుత్వ భూమిగా ఉన్నది. ఇందులో 294/1 నుంచి 294/3 వరకు ఉన్న 51 ఎకరాలు ఇప్పటికీ ప్రభుత్వ భూమిగానే ఉండగా, 294/4 నుంచి 294/10 సర్వే నంబర్లలో ఉన్న భూమి మాత్రం ప్రైవేటు పట్టాకు ఎక్కినట్టు రెవెన్యూ రికార్డులు చెప్తున్నాయి. ఆ భూమిలో అదే గ్రామానికి చెందిన కుమ్మరి, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన కొంతమంది రైతులు చాలాకాలంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ భూములు తమ తాతల నుంచి తమకు వారసత్వంగా అసైన్డ్ పట్టా భూములుగానే వస్తున్నాయని రైతులు చెప్తున్నారు. అసైన్డ్ ల్యాండ్స్ అంటే అమ్మడానికి వీలు ఉండదు. అలా కాకుండా విక్రయిస్తే, పీవోటీ యాక్ట్ ప్రకారం స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే, ఈ భూముల్లోని 74 ఎకరాల వరకు కొంతమంది ప్రముఖ వ్యక్తులు కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ముందుగా ప్రముఖ వ్యక్తులకు చెందిన అనుచరులు రైతుల వద్దకు వెళ్లి లీజు పేరుతో వారి భూములను తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. భూమిని లీజుకు తీసుకున్న వ్యక్తులు పట్టా మార్పిడి చేసి కొంతమంది ప్రముఖ వ్యక్తులకు విక్రయించినట్టు ఇటీవల చౌదరిపల్లి గ్రామానికి చెందిన రైతులు కొందరు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అదే సర్వేనంబర్‌లోని 294/4, 294/5 భూముల మీద కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల కోసం.. బీఆర్‌ఎస్ యుద్ధం

మొదటిపేజీ తరువాయి...

తీసుకొచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులు వృద్ధాప్యంలో తమకు రావాల్సిన బెనిఫిట్స్‌పై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పడుతున్న ఇబ్బందులను ఏకరవు పెట్టారు. తమ హక్కులు, ఆకాంక్షల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం నెలకొన్నదని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు అండగా నిలవాల్సిన అవసరాన్ని బీఆర్‌ఎస్ నాయకత్వం గుర్తించింది. ప్రధాన ప్రతిపక్షంగా, లక్షల మంది ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని కేటీఆర్, హరీశ్‌రావు స్పష్టంచేశారు.

అండగా నిలవడం మా బాధ్యత: బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ ఎల్లవేళలా ఉద్యోగుల ఆకాంక్షలు, హక్కుల పట్ల సానుభూతితో ఉంటుందని కేటీఆర్, హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షల మంది ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తుంటే వారికి అండగా నిలవడం ప్రధాన ప్రతిపక్షంగా తమ బాధ్యత అని అన్నారు. సమావేశం అనంతరం ఉద్యోగుల ఆకాంక్షల సాధన కోసం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగ సంఘాలకు నాయకత్వం వహిస్తున్న నేతలకు మద్దతుగా నిలవాలని, పార్టీలోని ఉద్యోగ సంఘాల మాజీ నాయకులు, గతంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న రిటైర్డ్ నేతలను ఈ కార్యక్రమంలో కలుపుకోవాలని సూచించారు. ప్రధాన ప్రతిపక్షంగా, ఉద్యోగులకు అండగా ఉంటూ, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సహకరిస్తామని వెల్లడించారు.

సర్వేయర్ పోస్టులకు 8,500 దరఖాస్తులు

హైదరాబాద్, మే 17(నమస్తే తెలంగాణ): లైసెన్స్‌డ్ సర్వేయర్ల భర్తీ కోసం సుమారు 8,500 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. ప్రభుత్వం కొత్తగా ప్రైవేటు సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా నియమించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులను కోరింది. దరఖాస్తులకు ఈ నెల 17వ తేదీ (శనివారం) వరకు అవకాశం కల్పించింది. ప్రభుత్వం 5 వేల మంది సర్వేయర్లను మాత్రమే నియమించాలని నిర్ణయించగా.. గడువు నాటికి సుమారు 8,500 మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం.

రియల్ ఎస్టేట్ దివాలా!

మొదటిపేజీ తరువాయి...

ఉండేది. కానీ నిరుడు సగానికిపైగా పడిపోయింది. చివరికి.. కరోనా విపత్తు కంటే ఎక్కువగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ప్రభావం చూపిందని గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేసీఆర్ పాలనలో రియల్ ఎస్టేట్ ఆదాయం ఏటేటా పెరుగుతూరాగా.. రాష్ట్ర చరిత్రలో తొలిసారి కాంగ్రెస్ హయాంలో తిరోగమనం నమోదైంది.

కరోనాను మించిన విపత్తు

2020-21 ఆర్థిక సంవత్సరంలో కరోనా విపత్తు, లాక్‌డౌన్‌తో రియల్‌ఎస్టేట్ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. ఆ సంవత్సరంలో కూడా ప్రభుత్వం అంచనా వేసినదాంట్లో స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా 52 శాతం ఆదాయం వచ్చింది. 2021-22లో సెకండ్ వేవ్ విజృంభించినా, .. భూలావాదేవీలను అడ్డుకోలేకపోయింది. దీంతో ఆ ఏడాది అంచనాలో 98 శాతం రాబడి వచ్చింది. కొవిడ్ తర్వాత చాలామంది స్థిరాస్తిలో పెట్టుబడులు పెట్టారు. తెలంగాణలో భూముల ధరలు వేగంగా పెరుగుతుండటంతో మెరుగైన లాభాలు వస్తాయనే ఉద్దేశంతో బంగారం, స్టాక్స్ కంటే కూడా భూ లావాదేవీలకు మొగ్గు చూపారు. ఫలితంగా కొవిడ్‌కు ముందు వరకు రూ.7 వేల కోట్లు దాటని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం.. కొవిడ్ తర్వాత 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.12 వేల కోట్లను దాటేసింది. ఇది తెలంగాణ రియల్‌ఎస్టేట్ రంగం పటిష్టతకు నిదర్శనంగా నిలిచింది. ఆ తర్వాత 2022-23లో రాబడి రూ.14వేల కోట్లు దాటింది. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాదిన్నర తిరగకముందే స్థిరాస్తి రంగం కుప్పకూలింది. లక్ష్యంలో 46 శాతం ఆదాయం మాత్రమే సాధించి.. కొవిడ్‌ను మించిన విపత్తుగా మారింది.

ఏడాదిన్నరలోనే నేలచూపులు

ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో స్థిరాస్తిరంగం నేల చూపులు చూస్తున్నది. భూముల కొనుగోళ్లు, అమ్మకాలు భారీగా పడిపోయాయి. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు వచ్చిన ఆదాయమే ఇందుకు నిదర్శనం. కాళేశ్వరం పక్కనబెట్టడం, వ్యవసాయ రంగంలో ఒడిదుడుకులు వంటివి గ్రామీణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బతీశాయని నిపుణులు చెప్తున్నారు. ఇక.. హైదరాబాద్‌లో హైడ్రా ద్వారా అడ్డగోలుగా కూల్చివేతలు చేపట్టడంతో తీవ్ర ప్రభావం పడిందని అంటున్నారు. గతంలో లేక్‌వ్యూ ఫ్లాట్లు, విల్లాల అమ్మకాలు జోరుగా సాగేవని, హైడ్రా ఎఫెక్ట్‌తో ఇప్పుడు చెరువుల దగ్గరలో ఉన్న నిర్మాణాలంటేనే భయపడుతున్నారని చెప్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు అంటూ కొర్రీలు పెడుతుండటంతో ప్లాట్లు, ఫ్లాట్లు కొనాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నారని చెప్తున్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పేరుతో బఫర్ జోన్‌లో నిర్మాణాలు కూల్చేస్తారన్న వార్తలు సైతం ఇబ్బంది పెట్టాయని, ఇక ఫార్మాసిటీ రద్దు ప్రకటన, ఫోర్త్‌సిటీ పేరుతో చేసిన హడావుడి బెడిసికొట్టాయని వారు విశ్లేషిస్తున్నారు. వీటన్నింటి ఫలితంగా రియల్ ఎస్టేట్‌కు గుండెకాయ వంటి హైదరాబాద్‌లో నిర్మాణరంగం కుప్పకూలినట్టు చెప్తున్నారు.



గత పదేండ్లలో తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఆదాయం (కోట్లలో)

సంవత్సరం	ఆదాయం	చేరిన లక్ష్యం
2015-16	3,105.00	83.92 %
2016-17	3,821.66	89.04 %
2017-18	4,202.46	140.08 %
2018-19	5,344.04	113.70 %
2019-20	6,671.05	108.54 %
2020-21	5,243.28	52.43 %
2021-22	12.372.73	98.98 %
2022-23	14,228.19	91.21 %
2023-24	14,295.56	77.27 %
2024-25	8,473.21	46.48 %

2023-24లో ఆదాయం: 14295 కోట్లు
2024-25లో ఆదాయం 8473 కోట్లు
తగ్గుదల: 5,822 కోట్లు
తగ్గిన శాతం: 40.7%

కేసీఆర్ పాలనలో రూ.14 వేల కోట్లకు..

తెలంగాణ ఏర్పడినప్పుడు స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఖజానాకు వచ్చిన ఆదాయం రూ.3,105 కోట్లు మాత్రమే. 2022-23 నాటికి రూ.14,228 కోట్లకు పెరిగింది. అంటే.. ఆదాయం నాలుగున్నర రెట్లు పెరిగింది. సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్మాణం, అనేక పథకాలు, కార్యక్రమాలతో వ్యవసాయ రంగాన్ని బాగుచేయడం, భారీగా పరిశ్రమల రాక, కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల వృద్ధి.. ఇలా పక్కా ప్రణాళికతో నిర్మాణాత్మకంగా అభివృద్ధి జరిగింది. దీంతో అదేస్థాయిలో రియల్టీ కార్యకలాపాలు పెరిగాయి. రాష్ట్ర ఏర్పాటుకు ముందు రూ.2 లక్షలు కూడా పలకని ఎకరం భూమి విలువ.. పదేండ్లలో అనేక రెట్లు పెరిగింది. మారుమూల ప్రాంతాల్లోనూ రూ.30-50 లక్షలు పలికింది. హైదరాబాద్‌లో ఎకరం భూమి రూ.100 కోట్ల వరకు పలికిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఫలితంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం ఏకంగా నాలుగు రెట్లు పెరిగింది.

ఇద్దరు రియల్టర్ల ఆత్మహత్య

ఓవైపు అమ్మకాలు పడిపోవడం, మరోవైపు పెట్టుబడులు వెనక్కి రాకపోవడం, అప్పులు ఇచ్చినవారి ఒత్తిళ్లు తట్టుకోలేక రియల్ వ్యాపారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొంపల్లికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి (39) అనే బిల్డర్.. తాను నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో ప్లాట్లు అమ్ముడుపోక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో నర్సింహా గౌడ్ అనే రియల్టర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో బలవన్మరణానికి పాల్పడ్డారు.

సర్వే మ్యాప్ ఉంటేనే రిజిస్ట్రేషన్

- సాగు భూముల రిజిస్ట్రేషన్‌లో కొత్త విధానం
- ఐదు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుకు నిర్ణయం
- తాజా నిబంధనతో రైతులపై ఆర్థిక భారం
- సర్వేయర్ల అరాచకాలు పెరిగే అవకాశం

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రైతులపై కాంగ్రెస్ సర్కారు మరో పిడుగు వేయబోతున్నది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌లో కొత్త విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతున్నది. అందులో భాగంగా భూముల రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేసింది. ఇప్పటికే ఈ నిబంధనను భూభారతి చట్టంలో పొందుపర్చిన ప్రభుత్వం.. తాజాగా రాష్ట్రంలో ఎంపిక చేసిన 5 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు అమలుకు చర్యలు చేపట్టింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని సలార్‌నగర్, ఖమ్మం జిల్లాలోని ములుగుమాడు, ములుగు జిల్లాలోని నూగూరు, సంగారెడ్డి జిల్లాలోని సాహెబ్‌నగర్, జగిత్యాల జిల్లాలోని కొమ్మనపల్లి గ్రామాల్లో ఈ వారంలోనే ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నది. సర్వే బాధ్యతలను అనుభవం కలిగిన పలు సంస్థలకు అప్పగించినట్టు తెలిసింది. రిజిస్ట్రేషన్ చేయాల్సిన భూమిని సర్వే నంబర్లవారీగా డ్రోన్‌తో సర్వే చేయడం ద్వారా సరిహద్దులను గుర్తించి ఆ మ్యాప్‌ను జత చేస్తారు.

రైతులపై సర్వే భారం

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేయడమంటే రైతులపై ఆర్థిక భారం మోపడమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రతి భూమి క్రయ, విక్రయానికి కచ్చితంగా మ్యాప్ ఉండాల్సిందే.. అంటే ఒక భూమిని అమ్మినా, కొనుగోలు చేసినా తప్పనిసరిగా సర్వే చేయించాల్సిందే. ఈ సర్వేను రైతులే తమ సొంత డబ్బులతో చేయించుకోవాల్సి ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. దీంతో సర్వే పేరిట రైతులను వీరబాదుడు బాదడం ఖాయమని తేలిపోయింది. సర్వే కోసం సర్వేయర్లు ఎకరాలవారీగా వసూలు చేస్తారు. దీంతో సర్వే కోసం రైతులు రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

సర్వేయర్ల అరాచకాలు తప్పవా?

సర్వేయర్ల అరాచకాల గురించి ప్రత్యేకంగా చెప్పాలిన అవసరం లేదు. ముఖ్యంగా సామాన్యుల భూములను సర్వే చేసేందుకు వారు పట్టపగలే చుక్కలు చూపిస్తారు. సర్వే కోసం ప్రభుత్వానికి చెల్లించిన ఫీజు కాకుండా సర్వేయర్లకు ప్రత్యేకంగా ముట్టజెప్పుకోవాల్సిందే. లేదంటే సర్వే పూర్తికాదు, పని జరగదు. ప్రస్తుతం సర్వే అవసరం అంతంత మాత్రంగా ఉన్నప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేస్తే సర్వేయర్ల అరాచకాలు మరింత పెరగడం ఖాయమని స్పష్టమవుతున్నది. సర్వే మ్యాప్‌లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో భూముల సర్వే సందర్భంగా సర్వేయర్లు మరిన్ని అవకతవకలకు పాల్పడే అవకాశం లేకపోలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే మళ్లీ కొత్త చిక్కులు తప్పవేమోనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.